"ఎందుకు?"

"ఎన్సిసీలోనే తమ సరిగ్గా చేయలేకపోయేది. 'సి' సర్టిఫికెట్ ఫేలయింది. అయినా దానినే సెలక్ట్ చేసుకున్నారు అంటే సెలక్షన్‌కి కావలసింది ఆసలయిన అర్హతలు కాదు అందుకే నేను చెప్పేది. కొలతలుంటే....."

"అదేం కాదు. వాళ్ళ మమ్మీకి ఢిల్లీలో పొలిటికల్‌గా చాలా ఇన్‌ఫ్లూయెన్స్ వుంది"

"కొలతల ఇన్ ఫ్లూయెన్స్"

ఆమె నవ్వేసింది

"మీరెంతసేపూ అదే మాట్లాడతారెందుకు?"

"మనిషిని చాలా వరకూ అదే కంట్రోల్ చేస్తుంది కదా"

"నా మీదేనా? అందరిమీదా"

అమె నవ్వాపుకుంది కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా టేబిల్ మీదున్న పేపర్ వెయిట్‌ని గుండ్రంగా బొంగరంలా తిప్పిందామె.

"మీకు నిజంగా అంతగా కావాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు"

"మీ.........మీ........మీరు........"

"ఎస్ అదో పెద్ద కొంపలు కూలే వ్యవహారంగా, ప్రాణాలు వదిలయినా నిలబెట్టుకునే విషయంగా నేననుకోను. వాటీజ్ సెక్స్ ! జస్ట్ ఎ నైస్ ఫీలింగ్. విచ్చలవిడితనం నేనూ లైక్ చేయనుగాని రిజిడిటి అనవసరం. ఆ విషయానికొస్తే దేనికయినా రిజిడిటి అనవసరం . అఫ్టరాల్ మీరూ మీరూ, నేనూ మనం అనుభవించే
విషయాలు వస్తువులు, అన్నీ తాత్కాలికం. కెన్ యూ ఇమేజిన్? వంద సంవత్సరాల తర్వాత ప్రత్యూష అనే అమ్మాయి వుండేదని , సురేష్ అనే సర్వేయర్ వుండేవాడనీ ఎవరికైనా తెలుస్తుందా ? మన తాలూకూ గుర్తులేమయినా మిగుల్తాయా? నథింగ్! మన తాతయ్యల గురించీ నాయనమ్మల గురించీ ఎవరికి కావాలి? ఏం కావాలి? నాకీ సినిమాలు , నవలలు చూస్తే నవ్వొస్తుంది. శీలం లేని ఆడదాన్ని హీనంగా చూడటం. ఇవన్నీ మతాలు రుద్దిన మూర్ఖత్వం మనుషుల మీద"

సురేష్ స్పృహలోకొచ్చాడు.

"నాకు ఆశ్చర్యంగా వుంది. మన దేశంలో ఓ అమ్మాయి ఇంత ఓపెన్‌గా, ఇంత విజ్ఞానంతో మాట్లాడటం. మీరు మతాన్ని నమ్మరా"

ప్రత్యూష నవ్వింది మళ్ళీ

"అంటే దేవుడి గురించి అడుగుతున్నారు కదూ! దేవుడున్నాడనుకుంటున్నానా అని. అంతేనా?"

“సరే అదే అడిగాననుకోండి”

“నేను దేవుడిని నమ్ముతానా అనేదే మీ ప్రశ్న అయినట్లయితే -నో! నేను నమ్మను! అంతా శూన్యమని నేననుకుంటాను. పూర్తి శూన్యం. పునర్జన్మలూ, చనిపోయినా నరకాలూ, స్వర్గాలూ అంత ట్రాష్. దేవుడనేదే లేదు. అదంతా మనసు అల్లుకునే ఊహాగానాలు. అసలు నేనేది ఋజువు చేయాలని అనుకోను. ఉన్నాడనీ, లేడని బ్రతకటమే అనవసరమని నా అభిప్రాయం. అలా జీవితం గడిచిపోవాలి. అంతే”

సురేష్ ఆమె చేతిని అందుకుని ముద్దు పెట్టుకున్నాడు . ఆమె చేతిని లాగేసుకుని లైబ్రరీ వైపు చూసింది ఎవరయినా గమనించారేమోనని.

“అందరూ మీలా ఆలోచించే అమ్మాయిలయితే నాలాంటివాళ్ళు ఎంత అద్భుతమయిన జీవితం అనుభవిస్తారు” నవ్వుతూ అన్నాడు.

“తులసి నాలాంటి అమ్మాయేగా?”

సురేష్ ఆశ్చర్యపోయాడు.

“మీకెలా తెలుసు?”

“కాకపోతే మీరు జీవితాన్ని ఇంతగా ఎంజాయ్ చేయలేరు”

ఓ ముసలాయిన చేతికర్రతో వచ్చాడు ప్రత్యూష దగ్గరకు.

“లైఫ్ ఆఫ్టర్ డెత్ గురించి బుక్స్ ఏమైనా వున్నాయా మేడమ్?”

సురేష్ లేచి నిలబడ్డాడు.

“సీ యూ లేటర్”

“వాట్ అబౌట్ మై ఆఫర్?” కవ్వింపుగా అడిగిందామె.

“బాగా లోతుగా వెళ్ళి ఆలోచించి చెప్తాను”

ఆమె అతని చేతిమీద గిల్లి బుక్ రాక్ దగ్గరకు వెళ్ళిపోయింది.

సురేష్ చౌరస్తా చేరుకున్నాడు.

జనం.....ప్రవాహంలా అన్ని వైపులకు పరిగెత్తుతున్నట్లు నడుస్తున్నారు. ఇంకో పావుగంట వుంది తులసి ఆఫీస్ నుంచి రావడానికి.

28-20-26 అనుకున్నాడతను మళయాళ హెయిర్‌స్టయిల్ చూసి.

“ఎంత?” అందామె ఆగిపోయి కోపంగా.

“ఆళవు” అన్నాడు సురేష్

“ఎన్తు అళవు?” మరింత కోపంగా అడిగింది.

“నీళం, వీతి, పొక్కం........”

“అల్పన్ ” అనేసి విసురుగా వెళ్ళిపోయిందామె.

దీప, తులసి దగ్గరేకొచ్చేశాక  చూశాడు.

“హలో .....హలో ...దీపాజీ!  ఎనీ ప్రోగ్రెస్?”  అడిగాడు ఉత్సాహంగా.

“ప్రోగ్రెసేమిటి?”

“అదే .....మీ  మారేజ్ తాలూకూ ప్రోగ్రెస్ రిపోర్ట్”

ఆమెకు అర్థమైంది మొహం మాడ్చుకుని జవాబివ్వకుండా వూరు కుంది.

“అవసరమనుకుంటే చెప్పండి నేను హెల్ప్ చేస్తాను.  ఒక్కరు చేయలేని పని ఇద్దరయితే తేలిగ్గా చేసేయగలరని మీరు ఎయిత్ క్లాస్‌లో చదవలేదూ”

తులసి నవ్వాపుకోలేక పోయింది.

“గుడ్ బై” అంది దీప

“బై” అంది తులసి

ఆమె వెళ్ళిపోయింది

బస్‌స్టాప్ కొచ్చి నిలబడ్డారిద్దరూ.

“ఇవాళ లాస్ట్ డే” అంది తులసి.

అతను నమ్మలేనట్లు చూశాడు.

“నిజంగానా?”

“చెక్ , టెర్మినేషన్ ఆర్డర్స్ ఇచ్చేశారు”

“ఒండర్ ఫుల్!  ఇవాల్టినుంచీ  డే అండ్ నైట్ హా హా....”

ఆమె కోపంగా చూసిందతని వైపు

“బస్ వచ్చింది పద ఇందులో వెళదాం ” అందామె.

“ఇదెందుకు? మనింటి వైపు పోదుగా”

“నాకూ తెలుసా విషయం. త్వరగా ఎక్కు ” ఆమె ముందునుంచి ఎక్కేసింది. అతను పరుగుతో వెళ్ళి బోర్డ్‌మీద నిలబడ్డాడు.

బస్ దిగగానే ఆమె పక్కకు పరుగెత్తాడు మళ్ళీ.

“ఇటెక్కడికి”

“డాక్టర్ కుమారి దగ్గరకు?”

“సురేష్ అదిరిపడ్డాడు”

“డాక్టర్ కుమారా?”

“అవును, అదివరకెప్పుడోసారి వెళ్ళాం గుర్తులేదూ?”

“ఆ .........ఉంది......ఉంది.........ఉంది  ........ఆమె దగ్గరకెందుకిప్పుడు?”

“నాకేదో డౌట్‌గా వుంది”

అతనికి చెమటలు పట్టేసినయ్.

"అంతేనా? అయితే ఇంకో డాక్టర్ దగ్గరకెళ్దాం ఈమె దగ్గరకి ఎందుకు?"

"ఎవరయితేనేం?"

"ఈమె చాలా హారిబుల్ డాక్టర్ ! సుఖంగా డెలివరీ అయ్యే కేసులు కూడా సిజేరియన్ చేసేస్తుంది".

"ఎందుకు?"

"ఫీజ్ కోసం. రెండువేలు క్యాష్‌డౌన్. అదే ఆర్డినరీ డెలివరీ అయితే వెయ్యి రూపాయలేగా"

"అబ్బ! డాక్టర్ ప్రొఫెషన్ ఎంత దారుణంగా తయారైంది"

"చాలా ......మనం వెనక్కు తిరుగుదామా?"

"ఈమె దగ్గరకే వెళ్దాంలే. నాకు డెలివరీ కేస్ కాదుగదా భయమేముంది"

"కాకపోయినా సరే. ఈ మధ్య ఒకామెకి ప్రెగ్నెన్సీ లేకపోయినా సిజేరియన్ చేసేసింది."

"ఎందుకు?"

"అలవాటు చొప్పున ఫీజు కోసం"

"నీకెలా తెలుసు ఇదంతా?"

సురేష్ ఉక్కిరిబిక్కిరయ్యాడు.

తులసి డాక్టర్ కుమారి డిస్పెన్సరీలోకి నడిచింది.

వెనకే తనూ నడిచాడతను.

డాక్టర్ లోపల గదిలో ఎవరితోనో మాట్లాడుతోండటం వినబడుతోంది.

"మీకు శుభవార్త! తల్లి కాబోతున్నారు"

"ఆ ...అలాగే .......కానీ .......కానీ నాకింకా పెళ్ళి కాలేదండీ"

"అయితే దుర్వార్త ! రెండువేలు ఫీజవుతుంది....."

మాటలు నెమ్మదయి వినిపించకుండా పోయినయ్.

ఆ యువతి బయటికొచ్చింది.

"నెక్స్ట్" అంది డాక్టర్,

తులసితోపాటు లోపలకు నడిచాడతను.

అతనిని చూస్తూనే డాక్టర్ ఆశ్చర్యపోయింది.

"మళ్ళీ వచ్చారేమిటి? ఎనీ ప్రాబ్లెమ్?"

"నా ప్రాబ్లెమ్ చాలా ఈజీగా అయిపోయింది"

“ఏమిటది?” అర్థంకాక అడిగిందామె

“అదే” అంటూ తులసి వైపు చూశాడతను.

తులసి వాళ్ళిద్దరివంకా చూస్తోంది అయోమయంగా.

“మళ్ళీ అంటున్నారేమిటి ?” అడిగింది డాక్టర్ని.

సురేష్ చప్పున కల్పించుకున్నాడు “అదివరకోసారి మనిద్దరం వచ్చాం కదా”

“ఓ ...చాలా కాలమయిందిగా ఇంకా గుర్తున్నానా ......?” అడిగింది తులసి .

“నో......నో మీరు కాదు. దట్ జెంటిల్మాన్ అండ్ హిజ్ వైఫ్.”

తులసికి మతిపోయింది.

“నేనే అతని భార్యను”.

“మీరు అతని భార్యా .....?” డాక్టర్ ముఖంలో చిరునవ్వు మాయమైంది.

సురేష్‌కి తెలిసిపోయింది పరిస్థితి చేజారిపోతోందని.

వెంటనే కల్పించుకున్నాడు “ఎస్ ! ఈమె నాభార్య ! నేనీమె భర్తను.....! ఇద్దరం పరస్పరం భార్యాభర్తలం”

“కానీ మొన్న మీతో వచ్చినామె.........”

“నాతోనా? నెవర్ నేనెప్పుడూ మీ దగ్గరకు రాలేదు.”

“ఆర్ యూ షూర్?”

“క్వయిట్ షూర్..... ! పెళ్ళయిన దగ్గర్నుంచి ఒక భార్యతోనే మానేజ్ చేస్తున్నాను”.

“యూ ఆర్ లయింగ్ ”అంది డాక్టర్ కోపంగా.

“అఫ్‌కోర్స్ ....లయింగ్ పొజిషన్ తర్వాతేగా మీ అవసరం కలిగేది.......”